బ్యాడిగ మిర్చి @60 వేలు

- పెరిగిన ధరలు
- 43,861 ఎకరాల్లో సాగు
- నాణ్యతలో అగ్రగామిగా నిలిచిన రాయదుర్గం

గుమ్మఘట్ట మండలం ఆర్ కొత్తపల్లికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి 4 ఎకరాల్లో బ్యాడిగ మిర్చి సాగు చేశాడు. ఇటీవల మిర్చిని మార్కెట్‌కు తీసుకెళ్లగా క్వింటా రూ.58 వేలతో అమ్ముడు బోయింది. అలాగే పూలకుంటకు చెందిన తిప్పేశ్, రంగసముద్రం గ్రామానికి చెందిన బోయ గిరిష్ మార్కెట్‌కు మిర్చి తీసుకెళ్లగా మొదటి రకం రూ.57,289, రెండో రకం రూ.49,920 రేటు లభించింది.

రాయదుర్గం: ఎండు మిర్చి 'ఎర్ర' బంగారమైంది. నెల రోజుల కిందట క్వింటా రూ.30 వేల నుంచి రూ.40 వేలు మాత్రమే పలికిన ధరలు అనూహ్యంగా పెరిగి రూ.60 వేలకు చేరుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో 24,661 మంది రైతులు 43,861 ఎకరాల్లో ఎండు మిర్చి (బ్యాడిగ) పంట సాగు చేశారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 40 శాతం అదనంగా బ్యాడిగ మిర్చి పంట సాగులోకి వచ్చింది. అయితే పంట చేతికొచ్చే సమయానికి ఆకుమచ్చ, కాయకుళ్లు, పేనుబంక, నల్లి ఇతర తెగుళ్ల వెంటడంతో మోతాదుకు మించి పురుగు మందులు పిచికారీ చేశారు. కోటి ఆశలతో సాగు చేసిన పంట నానాటికీ పతనమైపోతూ కనిపించింది. ఆశించిన స్థాయిలో లాభాలు తెచ్చిపెట్టకపోయినా, నష్టాలు మాత్రం మిగల్చలేదు. చాలా


పూలకుంట వద్ద మిర్చిని తొలగిస్తున్న మహిళలు (ఫైల్)

మంది రైతులు ఈ ఏడాది 60 శాతానికి పైగా పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. దీనికి తోడు అధిక ధరలు కలసి రావడంతో పెట్టుబడలు కోల్పోకుండా కాస్త లాభాలతోనే గట్టెక్కారు.

మిర్చి సాగు వివరాలిలా..

నియోజక వర్గం	మిర్చి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతుల సంఖ్య
రాయదుర్గం	1580	11071
కళ్యాణదుర్గం	3198	1485
ఉరవకొండ	39083	12055

నాణ్యతలో మేటి..

కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగ అనే గ్రామంలో మార్కెట్ ఉంది. ఇక్కడ నిత్యం కోట్లలో లావాదేవీలు జరుగుతుంటాయి. కర్ణాటకతో పాటు ఏపీలోని పలు జిల్లాల నుంచి రైతులు ఈ మార్కెట్‌కే మిర్చి పంటను తరలిస్తుంటారు. ఇటీవల గుమ్మఘట్ట మండలం ఆర్ కొత్తపల్లికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి సాగు చేసిన మిర్చి మార్కెట్లోనే టాప్ రకంగా నాణ్యత సాధించింది. దీంతో పలువురు రైతులు అభినందనలు తెలిపారు. ఇలా ఈ రైతు ఒక్కడే కాదు మన ప్రాంతంలో పండిన మిర్చి అంటేనే అధిక ధరలు పలకడం సాధారణగా మారింది.

ధరలే కాపాడాయి



మూడెకరాల్లో ఎండు మిర్చి (బ్యాడిగ) సాగు చేశాను. తెగుళ్ల కారణంగా దిగుబడి బాగ దెబ్బతింది. అన్నీ జాగ్రత్తలు పాటిస్తూ పంటను 60 శాతం కాపాడుకున్నాను. క్వింటా రూ.44,725 అమ్మకం చేపట్టడంతో మొదటి విడతలో రూ.7.25 లక్షలు చేతికి వచ్చాయి. దీంతో పెట్టుబడులు, కూలీలు పోనూ ఆదాయం లభించింది.

– గొల్ల వీరన్న, రైతు, పైదొడ్డి

5 ఎకరాల్లో సాగు



ఏటా తప్పక మిర్చి పంట సాగు చేస్తాను. ఈ ఏడాది 4 ఎకరాల్లో పంట సాగు చేశాను. మచ్చ తెగుళ్ల కారణంగా దెబ్బతింది. ఎకరాకు రూ. 80 నుంచి రూ.లక్ష దాకా పెట్టుబడులకు ఖర్చు చేశాను. 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశించాం. అయితే 5 నుంచి 10 క్వింటాళ్లలోపే వచ్చింది. ధరలు ఆశాజనకంగా ఉండటంతో పెట్టుబడులు చేతికందాయి. క్వింటా రూ.47 వేలతో 37 క్వింటాళ్లు విక్రయించాను. ధరలే రైతుకు కాస్త ఊరటనిస్తున్నాయి.

– మంజునాథరెడ్డి, రైతు, రంగసముద్రం

సాగు విస్తీర్ణం పెరిగింది



రాయదుర్గం ప్రాంతంలో క్రమంగా బ్యాడిగి మిర్చి సాగు విస్తరించింది. ఈ ప్రాంతంలో పండిన మిర్చి నాణ్యతలో మేటిగా నిలిచింది. రైతులకు పంటల సాగులో సూచనలిచ్చాం. అయితే వివిధ తెగుళ్ల సోకడం, కాయకు మిర్చి ఈగ దాడి పెరగడంతో దిగుబడితో పాటు కొన్ని చోట్ల నాణ్యత కూడా దెబ్బతింది. అదృష్టం బాగుంటే ఈ ఏడాది మిర్చి పంట పండి ఉండేది.

– దస్తగిరి, ఉద్యానశాఖ అధికారి, రాయదుర్గం

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఉరవకొండ/కళ్యాణదుర్గం/కంబదూరు/రాయదుర్గంటౌన్/కణేకల్లు/కుందుర్పి: ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు చిన్నముష్టూరులోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 528 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 505 మంది హాజరయ్యారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ కళాశాల, వివేకానంద ప్రైవేట్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో 916 మంది విద్యార్థులు హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారు. కంబదూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 146 మంది హాజరయ్యారు. రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల కేంద్రాలుగా పరీక్షలు జరిగాయి. మొదటి రోజు 856 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 839 మంది హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా కళాశాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవ్సరం పరీక్షలను


రాయదుర్గంటౌన్: హాల్‌టికెట్, రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించారు. స్క్వాడ్ టీమ్ హెడ్ సుదర్శన్‌రాజు పట్టణంలోని మూడు కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కణేకల్లులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొత్తం 222 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 9 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రమణ తెలిపారు. కుందుర్పి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 114 మంది హాజరు కావాల్సి ఉండగా 106 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు.

ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యం

కూడేరు: ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా కృషి చేయాలని మలేరియా జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ త్యాగరాజు మండల వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన కూడేరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్‌ను పరిశీలించారు. జ్వరాలతో వైద్యం కోసం రోజూ ఎంత మంది వస్తున్నారు? రక్త నమూనాలను సేకరిస్తున్నారా? వైరల్ ఫీవరా? మలేరియానా? సాధారణ జ్వరమా? అని నిర్ధారణ రిపోర్టు రోగులకు ఎప్పటిలోపు అందజేస్తున్నారు అని ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్ కుమార్‌తో ఆరా తీశారు. తర్వాత ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రతలు తీసుకునేలా చైతన్య పరచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని కమ్మూరులో పర్యటించారు. అక్కడ జరుగుతున్న లార్వా సర్వేను పరిశీలించారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు దోమకాటుతోనే వస్తాయని, దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఎక్కువ


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు

రోజులు నీటిని పాత్రలు, డ్రమ్ముల్లో, పాతటైర్లు, కొబ్బరి చిప్పల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలియజేశారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ టీం సభ్యులు ఓబులేసు, మహబూబ్ బాషా, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సీహెచ్‌ఓ మోహన్ బాబు, సూపర్‌వైజర్లు నూరు బాషా, రవీంద్ర, ఏఎన్‌ఎం మాధవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాతిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

బొమ్మనహాళ్: కుటుంబ సభ్యులు ఖననం చేసిన మహిళ మృతదేహాన్ని అధికారులు వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు.. గత ఏడాది నవంబర్ 2న బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ట్రాక్టర్ ట్రాలీపై పడిన ఘటనలో నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో మహిళ బళ్లారిలోని విమ్స్‌లో చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రాణాలతో బయటపడిన సుంకమ్మ (48) కుడికాలు కోల్పోయింది. ఐదు మాసాల చికిత్స అనంతరం ఇటీవల ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న ఆమె ఇన్‌ఫెక్షన్ కారణంగా మంగళవారం వేకువజామున మృతి చెందింది. దీంతో అదే రోజు సాయంత్రం స్థానిక శ్మశాన వాటికలో ఆమె మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం బుధవారం పత్రికల్లో వెలువడింది. సమాచారం తెలుసుకున్న అధికారులు మధ్యాహ్నం దర్గాహొన్నూరు గ్రామానికి చేరుకుని సుంకమ్మ మృతిపై ఆరా తీశారు. అనంతరం ఎస్‌ఐ శివ, తహసీల్దార్ శ్రీనివాసులు సమక్షంలో మృతురాలి భర్త బొజ్జప్ప, కుటుంబసభ్యులతో కలసి శ్మశానికి చేరుకుని పాతిపెట్టిన సుంకమ్మ మృతదేహాన్ని వెలికి తీయించి రాయదుర్గం ప్రభుత్వ వైద్యాధికారి ప్రభావతి పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుత్ ప్రమాదంలో గాయపడినట్లుగా గతంలో కేసు నమోదైన నేపథ్యంలో మృతదేహానికి పోస్టుమార్టం అనివార్యమైందని ఈ సందర్భంగా ఎస్‌ఐ శివ తెలిపారు.


సుంకమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

బస్ షెల్టర్‌ను ఢీకొన్న వ్యాన్

- ఐదుగురికి గాయాలు

కళ్యాణదుర్గం: ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి పేపర్ వ్యాన్ అదుపు తప్పింది. ఈ సంఘటన బుధవారం ఉదయం కళ్యాణదుర్గం మండలం హులికల్లు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గం వైపు నుంచి ఓ దిన పత్రికను రవాణా చేసే వాహనం కళ్యాణదుర్గం వైపు వస్తోంది. ఇదే వాహనంలో కణేకల్లు మండలం ఆదిగానిపల్లి గ్రామానికి చెందిన బంధువులైన నలుగురు సభ్యులు కళ్యాణదుర్గం మండలం బోయలపల్లి గ్రామంలో తమ బంధువైన గౌరమ్మ (92) చనిపోయిందన్న వార్త తెలుసుకుని అంత్యక్రియలకు హాజరయ్యేందుకు గుండ్లపల్లిలో వాహనంలో ఎక్కారు. హులికల్లు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న బస్ షెల్టర్‌ను పేపర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ షేక్ నిజాముద్దీన్‌తో పాటు వాహనంలో ప్రయాణిస్తున్న బంధువులైన కురబ రుద్రయ్య, కురబ వన్నమ్మ, మాలమ్మ, వనితమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన మహిళను ఆసుపత్రికి తీసుకెళ్తున్న స్థానికులు

ఉపాధిలో రూ.40 వేలు రికవరీ

కళ్యాణదుర్గం: ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై అధికారులు బుధవారం బహిరంగ చర్చ నిర్వహించారు. స్థానిక ఏపీడీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి డ్వామా ఫైనాన్స్ మేనేజర్ వెంకటనాయుడు, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి హాజరై పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా బెళుగుప్ప మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 15 గ్రామ పంచాయతీల్లో రూ.6.98 కోట్లతో 1,306 పనులు చేశారు. అయితే ఇందులో ఆయా గ్రామ పంచాయతీల నుంచి రూ.40,808 వరకూ అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. వెంటనే ఈ మొత్తాన్ని రికవరీ చేయించారు. అదే విధంగా పలు గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేసిన ప్రదేశాల్లో బోర్డులు లేకపోవడం, హార్టికల్చర్‌లో మొక్కలు లేనట్లు గుర్తించారు. బోర్డులను 15 రోజుల్లో ఆయా ప్రదేశా ల్లో ఏర్పాటు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న, ఎంపీడీఓ యాదవేంద్ర, ఏపీడీ రమేశ్ నాయక్, ఏపీఓ కృష్ణమూర్తి, జేఈ సుధాకర్ పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ నివేదికలను పరిశీలిస్తున్న అధికారులు

మృత్యువుతో పోరాడి ఓడింది..

రాయదుర్గం: ఇంట్లో గ్యాస్ మంటలు అంటుకుని ఏవీఆర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దీక్షిత (14) అనే విద్యార్థిని ఆస్పత్రి పాలైంది. గత 15 రోజులుగా మృత్యువుతో పోరాడి బుధవారం తుదిశ్వాస విడిచింది. వివరాల్లోకెళ్లితే.. చిన్న నిర్లక్ష్యానికి భారీ మూల్యమే ఆ కుటుంబం చెల్లించుకుంది. వంటింట్లో దోమల నుంచి రక్షణ పొందే క్రమంలో బ్యాట్ అటు, ఇటు ఊపుతూ వెళ్లింది. ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. చిన్నారికి మంటలు అంటుకోవడంతో కేకలు పెట్టింది. ఇంట్లోనే ఉన్న తండ్రి శ్రీనివాసులు రక్షించే ప్రయత్నం చేసి అతను గాయాలతో బయటపడ్డాడు. ఇద్దరినీ ఈనెల 3న చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దీక్షిత మృతి చెందగా తండ్రి కోలుకుంటున్నాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె మరణ వార్త తెలిసి తల్లిదండ్రులు బోరున విలపించారు.

గిరిజన రైతులకు రుణాలు మంజూరు చేయాలి

వజ్రకరూరు: వజ్రకరూరులో ఆర్‌ఓఎఫ్ఆర్ చట్టం ద్వారా సాగుహక్కు పట్టాలు పొందిన గిరిజన రైతులకు రుణాలు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ హుసేనయ్యతో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సమావేశమయ్యారు. వెంకటాంపల్లిచిన్న తండా, వెంకటాంపల్లిపెద్దతండా, జరుట్లరాంపురం కొట్టాల, పందికుంట తండా, ఎన్‌ఎన్‌పీ తండా తదితర గ్రామాల్లో అటవీ భూములు సాగు చేసుకుంటూ సాగుహక్కు పత్రాలు పొందిన గిరిజన రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. మేనేజర్ హుసేనయ్య సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి సామానాయక్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, తిరుమలేష్ నాయక్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

కుందుర్పి: మహిళలు విద్య, ఆర్థిక సామాజిక రంగాల్లో రాణించాలని నియోజకవర్గ మహిళా కౌన్సిల్ సభ్యురాలు నారాయణమ్మ, ఏటీఎల్ జయచంద్రారెడ్డి తదితరులు సూచించారు. బుధవారం మండలంలోని కెంచంపల్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మహిళల హక్కులపై వివరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు కల్పించాయని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించి మహిళల ఆర్థిక పురోగతికి చేయూతనిచ్చారన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓ మూలోబన్న, ఐకేపీ మండల అధ్యక్షురాలు మంజుళ, సర్పంచ్ గంగాధర పాల్గొన్నారు.

120 పశువులకు టీకాలు

గుమ్మఘట్ట: జె.వెంకటంపల్లిలో బుధవారం గోపాలమిత్రల సహాయంతో 120 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు పశువైద్యుడు నవీన్‌కుమార్ తెలిపారు. గురువారం బెలోడులో టీకాలు వేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పశు వైద్య శిబిరానికి స్పందన


పాడి పశువులకు వైద్యం చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మండల పరిధిలోని పాపంపల్లి, మోరేపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా పశు వైద్య శిబిరానికి స్పందన లభించింది. పశు సంవర్ధక శాఖ, శ్రీసత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పాపంపల్లిలో 774, మోరేపల్లిలో 710 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. గొడ్డుమోతు పశువులకు వైద్యం, చూలు పరీక్షలు, పిడుదులు, గోమారి నివారణ, లేగదూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. డాక్టర్ టీవీ సుధాకర్, విశ్రాంత డాక్టర్ పుల్లయ్య, రామన్న, ఏడీ శ్రీనివాస గుప్తా, మంజునాథ్, రమేష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు వివేకానంద, ప్రసాద్, రాంప్రసాద్, రామచంద్ర మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, నియోస్పార్క్, క్యాటిల్, రెమెడీస్, విర్బాక్ తదితర ఫార్మ కంపెనీల ప్రతినిధులు రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కూడేరు: బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్ బుధవారం మండల కేంద్రంలోని అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అనంతపురం నుంచి బళ్లారికి వెళుతుండగా ఘటనా స్థలికి రాగానే ఫిట్స్ రావడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన అతడు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందాడు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండల పరిధిలోని వెలిగొండ గ్రామానికి చెందిన పాలేటి తిప్పయ్య తీవ్ర అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల సాయాన్ని వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ నాగప్ప తదితరులు మృతుడి భార్య మల్లికకు అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ ఖాతాలో జమ అవుతుందన్నారు.

21 నుంచి విద్యార్థులకు రాగి జావ

బొమ్మనహాళ్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రాగిజావ మంజూరైనట్లు మండల విద్యాధికారి తిమ్మప్ప బుధవారం తెలిపారు. మండలంలోని 50 పాఠశాలల్లో చదువుతున్న 9,650 మంది విద్యార్థులకు ఈనెల 21వ తేదీ నుంచి రాగిజావ అందజేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: స్థానిక పాతపేటలో నివాసముంటున్న పార్టీ యువజన విభాగం నాయకుడు దూదేకుల వన్నూర్‌బాషా (26) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి స్థానిక నాయకులతో కలిసి వన్నూర్‌బాషా మృతదేహానికి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీకి అభిమానిగా ఉంటూ గతంలో పార్టీ కార్యక్రమాల్లో వన్నూర్‌బాషా చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందన్నారు.

పేదలకు వరం 'ఫ్యామిలీ డాక్టర్'


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుల్తానా

బొమ్మనహాళ్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదల పాలిట వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుల్తానా అన్నారు. బుధవారం మండలంలోని కల్లుహోళ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 36 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, అరుణకుమారి, పాల్గొన్నారు.

21 వరకూ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


టీం సభ్యులతో ఎస్కేయూ టీం ఇన్‌చార్జ్ డాక్టర్ పీఎల్ కాంతారావు

కళ్యాణదుర్గం: భిన్న సంస్కృతులకు చిహ్నంగా జాతీయ సమైక్యతా శిబిరం నిలిచిందని ఎస్కేయూ టీం ఇన్‌చార్జ్, స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీఎల్ కాంతారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ బెంగళూరులో జాతీయ సమైక్యతా శిబిరం జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు భిన్న శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 12 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎస్కేయూ నుంచి టీం ఇన్‌చార్జ్‌గా వెళ్లడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు


ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యామ్‌సుందర్ చౌదరి

శెట్టూరు: విధులకు డుమ్మాకొడుతూ, ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల కేంద్రంలోని సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జునపై చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యామ్‌సుందర్ చౌదరి కోరారు. బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో కలెక్టర్ నాగలక్ష్మి సచివాలయాన్ని తనిఖీ చేసి, పనితీరును మార్చుకోవాలని మల్లిఖార్జునను మందలించారన్నారు. అయినా సదరు ఉద్యోగి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతస్థాయి అధికారులు వెంటనే విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని కోరారు.

పరామర్శ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని 1వ వార్డులో నివాసం ఉంటున్న సామాజిక సేవాకార్యకర్త ఎం.బెంజిమెన్ తల్లి ఎం.గంగమ్మ (85) బుధవారం మరణించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే గొల్ల అప్పయ్య (70) అనారోగ్యంతో మరణించడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పరిధిలోని గూళ్యపాళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామి తల్లి శకుంతలమ్మ(75) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, యువజన విభాగం జిల్లా కార్యదర్శి శశాంక్‌రెడ్డి, సర్పంచ్ మోనాలిసా, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి ప్రభుదాస్, జేవీవీ నాయకుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

శీర్ల కాలనీలో రోడ్డు వెడల్పు పనులు


భవనాలను తొలగిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలోని కొండ ప్రాంతంలో ఉన్న శీర్ల కాలనీలో బుధవారం ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచ్ మారుతేశ్వరీ, ఎంపీటీసీ గంగమ్మ పర్యవేక్షణలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. కొండ పై నుంచి వర్షపు నీరు, మురుగు రోడ్లపై ప్రవహిస్తుండటంతో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని గతంలో కాలనీ వాసులు అధికారులను కోరారు. రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు నిర్మించుకోవడంతో డ్రైనేజీ ఏర్పాటుకు ఆటంకం కలగింది. కాలనీ వాసులు సహకరించడంతో జేసీబీ ద్వారా రోడ్లపై ఉన్న భవనాలను తొలగించి డ్రైనేజీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మంజునాథ్ తదితరులు ఉన్నారు.